క్లుప్తంగా

నేడు పాలేరులో మేరీమాత విగ్రహావిష్కరణ



76 అడుగుల మేరీమాత విగ్రహం

కూసుమంచి: పాలేరు గ్రామంలోని మేరీమాత పుణ్యక్షేత్రంలో 76 అడుగుల ఎత్తులో నిర్మాణం చేసిన మేరీమాత విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించనున్నట్లు విచారణ గురువు, ఫాదర్ కొమ్ము ఆంథోని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకకు ఖమ్మం పీఠాధిపతి డాక్టర్ సగిలి ప్రకాష్, నల్గొండ, వరంగల్ బిషప్‌లు థమన్, ఉడుముల బాల, ఖమ్మం విశ్రాంత గురువు మైపన్ పాల్, వరంగల్ ప్రొవెన్షియల్ సుపీరియర్ సిస్టర్ బీజీ జోషఫ్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మతగురువులు, భక్తులు హాజరవుతారని వివరించారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించబడుతుందని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దేవాదాయ శాఖ న్యాయవాది పూజలు

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర హైకోర్టు దేవాదాయ, ధర్మాదాయ శాఖ న్యాయవాది(జీపీ) మంగీలాల్ బుధవారం నగరంలోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయంలోని గోవులను దర్శించుకొని పూజలు చేసి దాణా తినిపించారు. ఈమేరకు ఆలయ ముఖ్య కార్యనిర్వాహణాధికారి చందూరు రామకోటేశ్వరరావు ఆలయ మర్యాదలతో న్యాయవాదిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

ఖమ్మం సహకారనగర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన సీనియర్ నాయకుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు బ్రెయిన్ స్ట్రోక్‌తో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు బుధవారం టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) నాయకులు పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు మాట్లాడుతూ.. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఇదిలా ఉండగా టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) వ్యవస్థాపకుడు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, జాయింట్ సెక్రటరీ మేకల కల్యాణ్ చక్రవర్తిలు వాకబు చేయగా.. వెంకటేశ్వర్లు సతీమణి రమాదేవి, యూనియన్ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



బాధితులతో మల్లిబాబు, ఇతర నాయకులు

తిరుమలాయపాలెం: మండలంలోని రాజారం గ్రామంలో ఇటీవల కలుపు మందు కొట్టిన పెసర చేలో మేత మేసి గొర్రెలు దాదాపు 200కు పైగా మృత్యువాత పడిన విషయం విదితమే. ఈ మేరకు బుధవారం డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, రాష్ట్ర నాయకుడు దుబాకుల శ్రీనివాస్, మండలం గొర్రెల సంఘం అధ్యక్షుడు దొడ్డి సాంబయ్యలు గొర్రెల బాధితులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా మల్లిబాబు మాట్లాడుతూ.. గొర్రెల వృత్తిపైన ఆధారపడి జీవించే కుటుంబాలు రూ.30 లక్షలకు పైగా నష్టపోయారని, వారికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన 559, 1016 జీఓలను పునరుద్ధరించి జీవాల మేత కొరకు చెరువు శిఖం భూములు, లోతట్టు ప్రాంతాలను సంఘాలకు అప్పగించాలని, రాష్ట్రంలోని ప్రతీ గొర్రెకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గొర్రెలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వేల్పుల మల్లయ్య కొమ్ము సైదులు, పేర్ల బయన్న, పేర్ల లింగయ్య, గాలయ్య, గుండాల సైదులు, మల్లయ్య, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు తిలోదకాలు



పల్లెగూడెంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలు

యథేచ్ఛగా ఇటుక బట్టీల నిర్వహణ

- గ్రామాలకు అతి సమీపంలోనే బట్టీలు
- అక్రమంగా కలప, చెరువు మట్టి తోలకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- కన్నెత్తి చూడని అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలో అనుమతుల్లేని ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అవి కూడా గ్రామాలకు అతి సమీపంలోనే నిర్వహించడం గమనార్హం. బట్టీల నిర్వహణతో సమీప గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. గ్రామాల్లో కొంతమందిని మచ్చిక చేసుకోవడం.. వారి అండదండలతో ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నా.. అటువైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు.

నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వ నిబంధనలు తంగలో తొక్కిన బట్టీల నిర్వాహకులు ఇష్టానుసారంగా గ్రామాలకు అతి సమీపాన నిర్వహిస్తున్నారు. అడవుల నుంచి యథేచ్ఛగా కలపను తరలించడం, చెరువుల నుంచి మట్టిని అక్రమంగా తరలించి బట్టీలు నిర్వహిస్తూ.. రూ.లక్షలు గడిస్తున్నారు. అదే విధంగా గ్రామాల చెంతనే బట్టీలు ఉండడంతో బట్టీలు కాలుస్తున్న సమయాన వచ్చే పొగతో ప్రజలు నానా రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. బట్టీలను కాల్చడానికి కలపను తరలించడంతో అడవులు అంతరించిపోయే ప్రమాదముంది. దీంతో భవిష్యత్‌లో ఇటు పర్యావరణానికి, అటు ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదముందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధాన రహదారులకు పక్కనే ఎంవెంకటాయపాలెం, పల్లెగూడెం, కాచిరాజుగూడెం, గొల్లగూడెం, బారుగూడెం, గుదిమళ్ల గ్రామాల్లో తమ ఇష్టానుసారంగా బట్టీల నిర్వహణ కొనసాగుతోంది. ఇటుక బట్టీల నిర్వాహకులు నిబంధనలకు తిలోదకాలిచ్చి అధికారులకు అమ్యామ్యాలు ఇచ్చి తమ పని కానిచ్చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పట్టించుకోని అధికారులు..

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాలకు అతి సమీపంలోనే ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నా.. అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రధాన రహదారుల వెంట ఉన్నా.. ఆయా శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదన్న విమర్శలున్నాయి. బట్టీల వల్ల వచ్చే పొగతో నిత్యం కాలుష్యం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం గ్రామాల్లో నిత్యం సందర్శించే ఆయా గ్రామాల కార్యదర్శులు కూడా అటువైపు వెళ్లకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలి. అధికారుల అలసత్వం, బట్టీల నిర్వాహకుల అత్యాశతో పంచాయతీల ఆదాయానికి గండి పడుతుందనేది జగమెరిగిన సత్యం. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి అక్రమ ఇటుక బట్టీలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బట్టీల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన కలప

నిబంధనలు ఇలా..

- ఎక్కడైనా ఇటుక బట్టీ నిర్వహించాలంటే ముందుగా సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి నుంచి నిర్వహణకు సంబంధించిన అనుమతి పత్రం తీసుకోవాలి. అది కూడా కార్యదర్శి క్షేత్రస్థాయికి వెళ్లి బట్టీ నిర్వహణ వల్ల పర్యావరణానికి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదని ధ్రువీకరించుకున్నాకే అనుమతి మంజూరు చేయాలి. అప్పుడు కొన్ని షరతులతో కూడిన అనుమతితో బట్టీలు నిర్వహించుకోవచ్చు.
- అదే విధంగా బట్టీలను కాల్చడానికి ఉపయోగించే కలపకు సంబంధించి ఈ బట్టీలో ఇంత మోతాదులో కలపను వాడుతున్నాం, దీనివల్ల ఎలాంటి ఇబ్బందిలేదని అటవీశాఖ అధికారులు కూడా అనుమతి ఇవ్వాలి.
- బట్టీలు కూడా గ్రామానికి దూరంగా జనసంచారం ఎక్కువగా లేని ప్రాంతాల్లో కనీసం 5 కిలో మీటర్ల దూరంలో నిర్వహించుకోవాలి.
- విద్యుత్‌ను వాడుకోవడానికి విద్యుత్‌శాఖ అనుమతి, మట్టి తోలుకునేందుకు మైనింగ్‌శాఖ నుంచి అనుమతి, ల్యాండ్ కన్వర్షన్ తప్పనిసరిగా ఉండాలి.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి



నేలకొండపల్లి: చెరువుమాధారంలో అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శిరీష



ఖమ్మంగాంధీచౌక్: గాంధీచౌక్‌లో పత్తి విత్తన ప్యాకెట్లను తనిఖీ చేస్తున్న అధికారులు

నేలకొండపల్లి/కామేపల్లి: విత్తన కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ విస్తీర్ణాధికారి బి.శిరీష, ఖమ్మం డివిజన్ ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారంలో బుధవారం రైతులకు అవగాహన కల్పించిన సందర్భంగా శిరీష, కామేపల్లి మండలంలోని ముచ్చర్ల రైతువేదికలో శ్రీనివాసరావులు మాట్లాడారు. వానాకాలం పంటలు సమీపిస్తున్నందున రైతులు విత్తనాలు కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు ప్రతీ విత్తనాలకు రశీదు తప్పకుండా తీసుకోవాలని, గ్రామాల్లో విత్తనాలను ఎవరూ కొనొద్దన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ అమ్మితే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. అదే విధంగా సబ్సిడీపై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ భూక్యా తారాదేవి, ఏఈఓ ఉష, రైతులు తీర్థాల చిదంబరరావు, నునావత్ వీరన్న, అజ్మీరా శంకర్, కాకర్ల వెంకటేశ్వర్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ..

ఖమ్మంవ్యవసాయం/కూసుమంచి: వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న వేళ ఖమ్మం నగరంలోని గాంధీచౌక్, పొట్టి శ్రీరాములు రోడ్, కాల్వొడ్డు తదితర ప్రాంతాల్లో ఉన్న విత్తన దుకాణాలను బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసు అధికారులు తనిఖీలు చేశారు. ఖమ్మం అర్బన్ మండల వ్యవసాయాధికారి బి.కిషోర్ బాబు, టీసీ ల్యాబ్ వ్యవసాయాధికారి శరత్, ఖమ్మం త్రీటౌన్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌లత కూడిన బృందం పలు విత్తన దుకాణాలను తనిఖీలు చేశారు. అదేవిధంగా కూసుమంచి, పాలేరు, కోక్యాతండా, చౌటపల్లి తదితర గ్రామాల్లోని విత్తన దుకాణాలను ఏఓ రామడుగు వాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు పలు రికార్డులను తనిఖీ చేశాక మాట్లాడుతూ.. విత్తన దుకాణదారులు విత్తన చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని, రైతులకు తప్పని సరిగా రశీదులు ఇవ్వాలని సూచించారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలన్నారు. రికార్డులు విత్తనాల విక్రయాలకనుగుణంగా సిద్ధంగా ఉంచుకోవాలని, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువగా విత్తనాలు విక్రయించినా, విత్తన కొరత సృష్టించినా తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ఒకేరకం విత్తనాలను విత్తుకోకుండా వివిధ రకాల విత్తనాలను నాటుకోవాలని అధికారులు సూచించారు.

విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలి

రఘునాథపాలెం: ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఉచితంగా ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యాన రఘునాథపాలెం మండలం తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ వ్యవసాయం ప్రారంభమైనప్పటికీ రైతాంగానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పురుగు మందులు ప్రభుత్వం సరఫరా చేయకుండా ప్రైవేటు వ్యాపార వర్గాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తి సాధనాలను 50 సబ్సిడీపై ఇవ్వాలని, రైతుల రుణమాఫీ చేయడంతో పాటు కొత్త రుణాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే, అన్ని రకాల వడ్లకు రూ. 500 చొప్పున బోనస్ వర్తింపజేయాలని, ఇన్సూరెన్స్ పథకాన్ని అన్ని పంటలకు వర్తింపజేయాలని, ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నాయకులు కేలోత్ లక్ష్మణ్, ధరావత్ లక్ష్మణ్, తేజ, వడ్డే వెంకటేశ్వర్లు, గుణగంటి వీరబాబు, భూక్య రమణ, కేలోత్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను దోచుకుంటున్న బీజేపీ..



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కామేపల్లి: దేశ సంపదను పేద ప్రజలకు పంచకుండా దోచుకుంటున్న పార్టీ బీజేపీ అని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. బుధవారం మండలంలోని ముచ్చర్ల గ్రామంలో మండల కార్యదర్శి వర్గ సభ్యుడు పుచ్చకాయల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు న్యాయం చేస్తానని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ పదేళ్ల కాలంలో పేద ప్రజలకు లబ్ధి చేకూర్చే ఏ ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టలేదని, కానీ బీజేపీ నాయకుల ఆస్తులు మాత్రం పెరిగాయన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు బీజేపీ పాలనపై విసుగు చెందారని,ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పారని, త్వరలో వెలువడే ఫలితాలతో ఋజువు కానుందన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని, దేశంలో బీజేపీని సాగనపంపడం తప్పదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందని, ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు ఏపూరి లతాదేవి, జిల్లా నాయకులు యర్రా బాబు, తోట రామాంజనేయులు, శతకోటి సత్యనారాయణ, బండి శ్రీను, పుచ్చకాయల వీరనారయణ, కమ్మ నాగేశ్వరరావు, వంకాయలపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: అనుమతులు లేకుండా ఇంటర్నేషనల్ సిలబస్ పేరుతో ప్రచారం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా విద్యా సంస్థలను నిర్వహిస్తూ.. అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన బుధవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. కలెక్టర్ స్పందించి అనుమతులు లేకుండా స్కూళ్లు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఫీజులను నియంత్రించకుంటే సంఘం ఆధ్వర్యాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బెజవాడ సాయి శేషు, రాజు, జిల్లా సహాయ కార్యదర్శి, సంగీత, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పంచాయతీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన నారపొంగు యాకూబ్, కోటేశ్వరరావుల కుటుంబసభ్యులు గత 30 ఏళ్ల తర్వాత బుధవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెల్దారుపల్లిలోని ఓ మామిడితోటలో వీరందరూ మూడు తరాల వారు పిల్లాపాపలతో కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నాక కుటుంబ పెద్దలపే శాలువాతో ఘనంగా సత్కరించారు.

సిటీ బస్సుల పునరుద్ధరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ అధికారులు నగరంలో సిటీ బస్సులను పునరుద్ధరించారు. పలు కారణాల వల్ల గతంలో ఈ సర్వీసును రద్దు చేసిన అధికారులు, బుధవారం నుంచి తిరిగి ప్రారంభించారు. ఈనేపథ్యాన పాత బస్టాండ్, కొత్త బస్టాండ్‌ల మధ్య ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ సర్వీసును తిప్పనున్నట్లు ఖమ్మం డిపో మేనేజర శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్‌కు జెడ్పీసెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా సిటీ బస్సు నడుస్తుందని తెలిపారు. పాతబస్టాండ్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వస్తే వారు కాల్వొడ్డున దిగి ఆర్డినరీ బస్సులు ఎక్కి టికెట్ తీసుకొని పాత బస్టాండ్‌లో దిగవచ్చని, అదే విధంగా ఐటీహబ్, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆర్డినరీ బస్సులు ఎక్కి పాత బస్టాండ్‌కు రావొచ్చని తెలిపారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం సూచించారు.

రెస్టారెంట్లు, హోటళ్లలో తనిఖీలు చేపట్టాలి

ఖమ్మంమయూరిసెంటర్: నిల్వ చేసిన మాంసం, కుళ్లిన ఆహారం ప్రజలకు పెడుతూ.. వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రెస్టారెంట్లు, హోటళ్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు పుట్టగొడుగుల్లా పెరిగి ప్రజల ప్రాణాలకు ముప్పు తీసుకొస్తున్నారన్నారు. జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత హోటళ్లు, రెస్టారెంట్లపై చర్యలు తీసుకోని పక్షంలో ఫుడ్ సెఫ్టీ అధికారి కారాయలయం ఎదుట సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, నందిపాటి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

నేలకొండపల్లి: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు, వాసవీ క్లబ్ అంతర్జాతీయ కార్యదర్శి రేగూరి హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యాన 50 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేగూరి వాసవీ, వాసవీ క్లబ్ ప్రతినిధులు గెల్లా జగన్ మోహన్‌రావు, ఎర్రం సుజాత, గుండవల్లి శ్రీనివాస్, గోళ్ల రాధాకృష్ణమూర్తి, మాశెట్టి వరప్రసాద్, కొత్త వేణుబాబు, తెల్లాకుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పులిపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలు



పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పులిపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలను ఆయన మిత్రబృందం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కత్తిరించి పులిపాటికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనంలో పులిపాటి ఉన్నప్పటికీ ఆయన మిత్రులు నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం బైపాస్ రోడ్డు వృద్ధాశ్రమంలో అన్నదానం, వస్త్రదానంతో పాటు రైల్వే స్టేషన్‌లో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరసమితి సభ్యులు, వాసవీక్లబ్ సభ్యులు, పులిపాటి ప్రసాద్ విద్యా సంస్థల అధ్యాపకులు, ప్రముఖ వైద్యురాలు యాలమూడి కావ్య, ఎస్‌కె.ఖాసీం, సతీష్‌చౌదరి, మజీద్, గోళ్ల రాధాకృష్ణ, గుమ్మడపల్లి శ్రీను, మాశెట్టి వరప్రసాద్, కొల్లారామారావు, కొంకిమళ్ల మృత్యుంజయ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం..

నేలకొండపల్లి: ట్రాక్టర్ అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లగా.. డ్రైవర్ చాకచాక్యంతో ట్రాక్టర్‌పై నుంచి దూకడంతో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చెరువుమాధారం గ్రామంలో ఓ రైతుకు చెందిన ట్రాక్టర్ దుక్కి దున్ని ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో చెరువు కట్ట దిగి మూల మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ వెంకటేష్ చాకచాక్యంగా ట్రాక్టర్ పైనుంచి దూకడంతో ప్రమాదం తప్పినట్లయింది. అనంతరం జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీశారు.

హెల్మెట్ ధరించాలి



కారును అందజేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

ఖమ్మంఅర్బన్: కారులో సీటు బెల్ట్, ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ తప్పక ధరించాలని నగర ట్రాఫిక్ ఏసీపీ బి.శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద మహేంద్ర కంపెనీకి చెందిన ఎక్స్‌యూవీ3ఎక్స్ గ్రాండ్ కారులను వీవీసీ మోటార్స్ షోరూం ద్వారా 20 కార్లు వినియోగదారులకు అందించే కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు తగ్గించుకునేందుకు పలు రకాల ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వీవీసీ మోటార్స్ ఎండీ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ వర్చువల్‌గా మాట్లాడుతూ.. మన్నికతో పాటు వినియోగదారుల రక్షణను దృష్టిలో పెట్టుకొని నూతన మోడల్ తయారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం బాధ్యులు, కొనుగోలుదారులు అపర్ణ, సమీరా, సునీత, ఉపేందర్, నిఖిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట నిర్మాణ పనులు ప్రారంభం



కాంక్రీట్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: మున్నేరు పరీవాహక ప్రాంతాలు వరద ప్రభావానికి గురి కాకుండా ప్రభుత్వం ఇరువైపుల 17 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మాణానికి కాంక్రీట్ వాల్ పనులకు రూ.690 కోట్లు మంజూరు చేసిన విషయం విదితమే. బుధవారం దీనికి సంబంధించిన కాంక్రీట్ పనులు దానవాయిగూడెం వైపు జలవనరులశాఖ అధికారులు ప్రారంభించారు. భూ సేకరణ లేకుండా ప్రభుత్వ భూమిలో పనులు చేసేందుకు అనువుగా ఉన్న దానవాయిగూడెం వద్ద మున్నేరుకు ఇరువైపుల కాంక్రీటు పనులు చేసేందుకు మట్టి పనులు చేశారు. వాటిని గత వారం రోజులు క్రితం క్వాలిటీ కంట్రోల్, డీజైన్స్ సీఈలు, ఇతర ఉన్నతాధికారులు పరిశీలించిన అనంతరం కాంక్రీటు పనులు ప్రారంభించారు.

ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయంపై అధికారుల పరిశీలన

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో హైవోల్టేజీ కారణంగా కాలిపోయిన డయాలసిస్ మిషన్లను బుధవారం విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. ఖమ్మం టౌన్ విద్యుత్ శాఖ డీఈ నంబూరి రామారావు, ఏఈ తావుర్యాలు డయాలసిస్ కేంద్రానికి ఉన్న విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రికి 500 కేవీఏ సామర్థ్యం కలిగిన హెచ్‌టీ సర్వీసు విద్యుత్ సరఫరా తమ పరిధిలో ఉంటుందని, అక్కడ నుంచి విభాగాలకు పంపిణీ ప్రక్రియ జరుగుతుందన్నారు. డయాలసిస్ కేంద్రంలో చేంజ్ ఓవర్ స్విచ్ వద్ద లూజ్ కాంటాక్ట్ ఉండటం వలన హైవోల్టేజ్ సమస్య తలెత్తి పరికరాలు కాలిపోయాయని వివరించారు. ఇటీవల వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు తలెత్తిన నేపథ్యాన టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలుండాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యుత్ పరికరాలు కాలిపోవడంతో ఆ శాఖ స్పందించి, పరిశీలించి ఆ శాఖకు తగిన సూచనలు చేసింది.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మహ్మద్ సలాం

ఖమ్మంమయూరిసెంటర్: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కార్పొరేషన్ పరిధిలో డ్రెయినేజీ వ్యవస్థను తక్షణమే మెరుగుపరచాలని, రోడ్లను మరమ్మతులు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాం అన్నారు. బుధవారం ఇందస్ట్రీ రోడ్‌లో జ్వాల నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం నడిబొడ్డులో చుక్క నీళ్లు పడితే చెరువులా మారిపోయే పరిస్థితి ఉందన్నారు. ప్రధానంగా మయూరి సెంటర్, పాత బస్టాండ్ సెంటర్, కాల్వొడ్డు తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. నగరంలోతాగునీటి కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, త్రీ టౌన్ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్, డాక్టర్ ఖాసీం భాషా, ఎస్‌కె.చానా, డి.శేఖర్, ఎండీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఖమ్మంలోని పాత డీఈఓ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. టీపీటీఎఫ్ ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాల పేరిట సంఘ జెండాలను ఆవిష్కరించారు. ఈమేరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీపీటీఎఫ్ చేసిన కృషిని పలువురు కొనియాడారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్